సాక్షి
మెదక్
ఆదివారం, 3, ఆగస్టు, 2025



చిన్నకోడూరులో తపస్వీ ఫౌండేషన్ సభ్యులు

ఈ స్నేహం .. సమాజ హితం

చిన్నకోడూరు(సిద్దిపేట): పాఠశాల విద్య ముగిసినా.. చెరిగిపోని స్నేహం వారిది. ఐకమత్యంగా ఉంటూ సమాజానికి హితోధిక సాయం చేయాలనే కాంక్ష ఆ స్నేహితులది. బడిబాట నుంచి మొదలైన బాల్య మిత్రుల పయనం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. చిన్నకోడూరు ఉన్నత పాఠశాలలో 1990–91లో పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులంతా ఒక్కటయ్యారు. 2016లో వీరంతా కలిసి తపస్వీ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. చదివిన పాఠశాలకు రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థిక సాయం, ఉచిత వైద్య శిబిరాలు, తోటి స్నేహితులకు కష్టకాలంలో ఆర్థిక సాయం అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

కల్మషం లేనిది.. కష్టాల్లో తోడుగా నిలిచేది



స్నేహానికి కన్న మిన్న.. లోకాన లేదురా.. అనేది ఒకప్పటి సినిమా పాట. ఇది నిజమేనంటున్నారు ఇప్పటి యువత, విద్యార్థులు, ఉద్యోగులు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' బృందం ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రత్యేక సర్వే నిర్వహించింది. మొత్తం వంద మందితో ఈ సర్వే చేసింది. యువత, విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న వారు, వృత్తి నిపుణులు.. వివిధ వర్గాలకు చెందిన వారి ఒపీనియన్‌లను సేకరించింది. తమ అభిప్రాయలు వెలుబుచ్చిన వారిలో సగం మంది మహిళలు ఉన్నారు. ఈ సర్వే ఆసక్తికరమైన అంశాలు వెలుగు చూశాయి. కల్మషం లేనిదే నిజమైన స్నేహమని ఎక్కువ మంది తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, నిజమైన స్నేహంలో స్వార్థానికి తావులేదని చెప్పారు. అవసరాలు తీర్చేదే స్నేహమని తక్కువ మంది తన అభిప్రాయాన్ని వెలుబుచ్చారు.

నిజమైన మిత్రులు.. ఇద్దరి కంటే ఎక్కువ ఉన్న వారే అధికం

- కన్నవారి తర్వాతే మిత్రుడు..
- ప్రస్తుత స్నేహ బంధాలు కలుషితం అవుతున్నాయి
- ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా సాక్షి సర్వే
- ఆసక్తి కరమైన అంశాలు వెలుగులోకి..

స్నేహం కలుషితమవుతోంది..


ప్రస్తుత రోజుల్లో ఫ్రెండ్ షిప్ కలుషితమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వంద మందిలో 57 మంది ఇదే అబిప్రాయాన్ని చెప్పారు. ఎలాంటి కలుషితకాలేదని 47 శాతం మంది చెప్పారు. ప్రస్తుత రోజుల్లో స్నేహితులు ఎంతో మంది ఉంటారు. కానీ నిజమైన స్నేహితులు పరిమితంగానే ఉంటారు. మీకు నిజమైన స్నేహితులు ఎంత మంది ఉన్నారనే ప్రశ్నకు ఇద్దరి కంటే ఎక్కువ మంది నిజమైన స్నేహితులు ఉన్నారని చెప్పిన వారే అధికంగా ఉన్నారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది స్నేహితులున్నారని 61 మంది చెప్పగా, ఒక్కరే నిజమైన స్నేహితుడు ఉన్నాడని 39 మంది అన్నారు.

మొదటగా కన్నవారే..

కన్న వారి తర్వాతే మిత్రుడికి స్థానమని ఎక్కువ మంది చెప్పారు. 67 శాతం మంది ఇదే అభిప్రాయాన్ని తెలిపారు. 27 శాతం మంది ఫ్రెండ్ తర్వాతే అమ్మానాన్న అని చెప్పిన వారు కూడా ఉన్నారు. నాన్న, అమ్మ, ఫ్రెండ్ అని చెప్పిన వారు 16 మంది ఉన్నారు.

– సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి, సంగారెడ్డి జోన్/మెదక్ జోన్/సిద్దిపేట

ఉమ్మడి జిల్లాలో సర్వే వివరాలు..



మన కోసం నిలబడే వాళ్లే..



సంగారెడ్డి టౌన్: స్నేహితుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు. మనకోసం నిలబడే వాళ్లే నిజమైన స్నేహితులు. కష్టాలు, బాధలు, సంతోషాలను పంచుకుంటూ అందరితో కలిసిపోతూ ఉండాలి. నా చిన్న నాటి నుంచి ముగ్గురు స్నేహితులం. వారు వృత్తిరీత్యా ఇతర దేశాలో స్థిర పడినప్పటికీ సమయం దొరికినప్పుడు కలుస్తూ ఉంటాం. ప్రతి ఒక్కరూ అందరితో కలిసి ఉండాలి. 'నేను ఉన్నాను' అనే ధైర్యం ఇవ్వాలి. సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ విజ్ఞాన పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి.

– సౌజన్య,
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

ఆనాటి స్మృతులు మధురం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్నేహితులతో కలిసి మట్టిలో ఆడిన ఆటలు.. చెట్లు కొమ్మల్లో దాగిన రోజులు నేటికీ గుర్తుకువస్తే ఎంతో సంతోషంగా ఉంటోంది. మళ్లీ ఆరోజులు వస్తే బాగుండు అనిపిస్తుంది. నాడు ఎక్కడికి వెళ్లినా ఒక జట్టుగా వెళ్లేవాళ్లం. ఒకరింటికి మరొకరం వెళ్తూ సందడి చేసే వాళ్లం. వినాయక చవితి, దసరా, దీపావళి, బోనాలు, బతుకమ్మ, హోలీ పండుగలను మిత్రులతో సంతోషంగా జరుపుకొనేది. చాలా మంది మిత్రులు నేడు ఉపాధ్యాయ వృత్తితో పాటు ఇతర వృత్తుల్లో ఉన్నారు. ఏ హోదాలో ఉన్నా కలుసుకున్నపుడు అనుభూతి ఏర్పడుతోంది.


– శ్రీనివాస్‌రెడ్డి,
సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి

బాల్య స్నేహితుడికి బాసట



గోపాల్ కుటుంబానికి బాసటగా నిలిచిన స్నేహితులు

శివ్వంపేట(నర్సాపూర్): బాల్య స్నేహితుడు అనారోగ్యంతో మృతిచెందగా తోటి స్నేహితులు మేమున్నామంటూ బాధిత కుటుంబానికి బాసటగా నిలిచారు. శివ్వంపేటకు చెందిన శేరిపల్లి గోపాల్ అనారోగ్యంతో ఆరేళ్ల క్రితం మృతిచెందాడు. ఇతనికి భార్య ఇద్దరు కుతూళ్లు ఉన్నారు. పేద కుటుంబానికి చెందిన గోపాల్.. వర్గల్‌లోని నవోదయ విద్యాలయంలో 1992–93లో పదో తరగతి పూర్తి చేశాడు. అప్పటి నవోదయ స్నేహితులు గోపాల్ కుటుంబాన్ని ఆదుకున్నారు. స్నేహితులందరూ రూ.3 లక్షలు పోగుచేసి గోపాల్ కుమార్తెలు చందన, అక్షయ పేరిట బ్యాంకులో డిపాజిట్ చేశారు.





- చెరగని చెలిమి.. చెదరని ఆత్మీయం
- వీడదీయలేనిది స్నేహబంధం

నేడు ఫ్రెండ్ షిప్ డే

ఓ నేస్తమా..

సమస్తం నీవే మిత్రమా...

హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే.. అనగానే ఏదో తెలియని అనుభూతి.. ఎదలోతుల్లోని జ్ఞాపకాలు ఒక్కసారిగా ఉబికివస్తాయి.. మరెన్నో మధుర స్మృతులు కళ్లముందు కదలాడుతాయి. అదొక అద్భుత స్నేహలోకం కనిపిస్తుంది.. స్నేహం అవధులు లేనిది.. అంతస్తులు చూడనిది.. వయసు లెక్కచేయనిది.. ఇష్టాలను పంచుకునేది.. కష్టాల్లో తోడుగా నిలిచేది.. ఇలా ఒకటేమిటి.. ఆ బంధాన్ని తెలిపేందుకు భావాలు ఎన్నో.. ఇలా స్నేహం గురించి ఎన్ని చెప్పినా.. అందుకే అంటారు స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతమని. నేటి ఆధునిక సాంకేతిక యుగంలో సామాజిక మాధ్యమాల కారణంగా ఎప్పుడో చిన్ననాటి స్నేహితులు కూడా దగ్గరవుతున్నారు. అలాంటి కోవలోకే ఉమ్మడి జిల్లాలోనూ కొందరు ఉన్నత స్థాయిలో ఉన్నా స్నేహ బంధాన్ని కొనసాగిస్తున్నారు. అంతేకాదు సమాజహితానికి తోడ్పడుతున్నారు. సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు ఓ కిడ్నాప్ ఘటన ముగ్గురిని ప్రాణస్నేహితులను చేయడం విచిత్రం. ఇలా ఎన్నో తీయనైన, మధురమైన స్నేహాలపై నేడు ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా మచ్చుకు కొన్ని ప్రత్యేక కథనాలు..



ఆప్తులున్నవారే అసలైన అదృష్టవంతులు



మెదక్ మున్సిపాలిటీ: వ్యక్తి ఏ స్థాయిలో ఉన్నా.. ఎన్ని ఆస్తులున్నా.. ఆప్తులను సంపాదించుకున్న వారే అదృష్టవంతులు. ఎవరి సమక్షంలో మన బాధలు సగం అవుతాయో.. ఎవరి కారణంగా మన ఆనందం రెట్టింపు అవుతుందో వారే అసలైన ఆప్త మిత్రులు. మానవ బంధాలన్నీ ఆర్థిక సంబంధాలతో ముడిపడుతున్న ఈ ఆధునిక యుగంలో స్వచ్ఛమైన స్నేహం కోసం తాపత్రయపడే వాళ్లెందరో ఉన్నారు. నేను డ్యూటీలో ఎంత బిజీగా ఉన్నా.. రోజూ స్నేహితులతో పది నిమిషాలు మాట్లాడతా. చిన్నప్పుడు కలిసి చదువుకున్న స్నేహితులతో ఇప్పటికీ కలుస్తాను. వారితో మాట్లాడి, ఊరు విషయాలు, కుటుంబ విషయాలు, ఇతర విషయాల గురించి చర్చించుకుంటాం. స్నేహితులతో కలిసి మాట్లాడటం వల్ల ఎంతో రిలీఫ్ ఉంటుంది.

– డీవీ శ్రీనివాసరావు,
ఎస్పీ, మెదక్ జిల్లా



'బంధీ'తో స్నేహ బంధం

ప్రాణస్నేహితులను చేసిన కిడ్నాప్ ఘటన..



మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, రామన్న, సికిందర్ కలిసి ఉన్న చిత్రం

దుబ్బాక: ఓ కిడ్నాప్ ఘటన ముగ్గురిని ప్రాణస్నేహితులను చేసింది. 34 ఏళ్ల క్రితం కిడ్నాప్ ఘటన జరిగినా ఆ ముగ్గురి మధ్య ప్రేమ నేటికీ చెక్కుచెదరలేదు. ఆ నాటి సంఘటన ఒక్కసారి గుర్తు చేసుకుందాం.. 1991 ప్రాంతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా సీఎంగా నెదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఉన్నారు. పీపుల్స్‌వార్ ప్రాబల్యం అధికంగా ఉన్న ఆ రోజుల్లో ప్రస్తుత మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. ఓ రోజు ఫారూఖ్ తన చిన్ననాటి స్నేహితుడు సికిందర్ తో కలిసి స్కూటర్‌పై దుబ్బాకకు వస్తున్న క్రమంలో అప్పటి దుబ్బాక పీపుల్స్ వార్ దళం కమాండర్‌గా ఉన్న రామన్న ఫారూఖ్, సికిందర్‌లను కిడ్నాప్ చేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వరంగల్ జిల్లాకు చెందిన రామన్న ఉద్యమ రీత్యా దుబ్బాక ప్రాంతంలో పనిచేస్తుండగా అప్పటి వరకు వీరికి ఎలాంటి పరిచయం లేదు. కిడ్నాప్ అయినప్పుడే వీరికి రామన్న పరిచయం అయ్యాడు. ఆతర్వాత రామన్న పీపుల్స్ వార్ పార్టీని వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చాక మాజీ ఎమ్మెల్సీ ఫారూక్, సికిందర్, రామన్నలు ప్రాణస్నేహితులయ్యారు. రామన్న ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో అ కుటుంబానికి ఫారూఖ్ హుస్సేన్ చాలా సార్లు అండగా నిలిచారు. వీరు ముగ్గురు తరుచూ కలుస్తూ తమ కష్ట సుఖాలు పంచుకుంటూ ఆదర్శ స్నేహితులుగా నిలిచారు. ఏదేమైనా బంధీలో పరిచయంలో ఈ ముగ్గురిని ప్రాణస్నేహితులను చేయడం విశేషం.

క్లాస్‌మేట్స్ క్లబ్ పేరిట సేవలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1981 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలిసి క్లాస్‌మేట్స్ క్లబ్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్లాస్‌మేట్స్ క్లబ్ అధ్యక్షుడు జయప్రకాశ్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్‌కు చెందిన ఉపాధ్యాయులు క్లాస్‌మేట్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని మా పూర్వ విద్యార్థులందరం కలిసి క్లాస్‌మేట్స్ క్లబ్ పేరిట సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. స్నేహితులు తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయం చేస్తున్నారు. తాము చదువుకున్న పాఠశాలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 2023 నుంచి నోట్ పుస్తకాలు అందిస్తున్నాం. అలాగే పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నాం. స్నేహితులందరం కలిసి సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉంది.



క్లాస్‌మేట్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం





పాఠశాలలో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకొంటున్న విద్యార్థులు

స్నేహ బంధం..

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో ముందస్తు ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను కట్టుకొన్నారు. ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి
కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌


దంతేపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్‌

రామాయంపేట(మెదక్‌): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌ అన్నారు. శనివారం మండలంలోని దంతేపల్లి, కిషన్‌ తండాల్లో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణ పనులు ఆలస్యం చేయవద్దని, త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. బిల్లులు కూడా వెంట వెంటనే మంజూరవుతున్నాయని, నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయనున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అనంతరం ఆయన గ్రామంలో పర్యటించారు. కుండీలలో నిల్వ ఉన్న నీటిని పరిశీలించి వెంటనే నీటిని తొలగించాలన్నారు. నీటిని నిల్వ ఉంచితే దోమల సంఖ్య పెరుగుతుందని వివరించారు. కలెక్టర్‌ వెంట ఎంపీడీఓ సజీవొద్దీన్‌, ఇతర అధికారులు ఉన్నారు.

ఎఎల్‌ఎం పోస్టులు మంజూరు చేయాలి

పాపన్నపేట(మెదక్‌): జిల్లాకు 51 అసిస్టెంట్‌ లైన్‌మెన్‌ పోస్టులు మంజూరు చేయాలని ఆర్థిక, విద్యుత్‌ శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు శనివారం మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 200 గ్రామాలకు సరిపడా ఎఎల్‌ఎంలు లేక విద్యుత్‌ సేవలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ మేరకు పాపన్నపేట మండలానికి 15, మెదక్‌ పట్టణానికి 5, ఘనపూర్‌ 6, మెదక్‌ 6, రామాయంపేట 5, చిన్నశంకరంపేట 7, నిజాంపేట మండలానికి 7 పోస్టులు మంజూరు చేయాలని కోరారు.

'విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు'

రామాయంపేట(మెదక్‌): సీజనల్‌ వ్యాధులపై ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్‌ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. విధిగా ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించాలన్నారు. అంతకుముందు రిజిస్టర్‌ను తనిఖీ చేసి ఫార్మసీ, ల్యాబ్‌ వార్డులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఆస్పత్రి వైద్యురాలు హరిప్రియతో పాటు ఏఎన్‌ఎంలు, నర్సులు ఉన్నారు.

మరో భవనంలోకి మార్చండి


టీచర్‌తో మాట్లాడుతున్న హైమావతి

అల్లాదుర్గం(మెదక్‌): మండల పరిధిలోని చిల్వెర అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణి హైమావతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ భవ నం పెచ్చులూడి శిథిలావస్థకు చేరిందని, మరో భవనంలోకి మార్చాలని ఆదేశించారు. కేంద్రం అపరిశుభ్రంగా ఉండటంపై టీచర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించాలని సూచించారు.

లోక్‌ అదాలత్‌ను విజయవంతం చేయాలి

మెదక్‌ కలెక్టరేట్‌: జిల్లాలోని పోలీస్‌, ఎక్సైజ్‌ శాఖలు సమన్వయంతో పనిచేసి సెప్టెంబర్‌ 13న నిర్వహించే జాతీయ లోక్‌ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఆర్‌ఎం సుభవల్లి అన్నారు. శనివారం జిల్లా పోలీస్‌, ఎక్సైజ్‌ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

నానోతో మేలు

ఎకరానికి అరలీటర్‌తో లాభాలెన్నో..

- పంటకు బహుళ ప్రయోజనం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ



మెదక్‌ కలెక్టరేట్‌: రైతులు ఎక్కువగా నత్రజని ఎరువులు వాడితే భూసారం తగ్గిపోయే ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. భూసారాన్ని తగ్గించే యూరియాను అధిక మొత్తంలో వాడొద్దని అవగాహన సదస్సులు నిర్వహించి మరీ చెబుతున్నారు. ఇదే సమయంలో భూసారంపై ప్రభావం చూపని ద్రవరూపంలో ఉండే నానో యూరియా వినియోగించాలని సూచిస్తున్నారు. నానో యూరియా అనేది ద్రవ రూపంలో ఉండే ఒక కొత్త నత్రజని ఎరువు. దీని కణాల పరిమాణం 20 నుంచి 50 నానో మీటర్లు మాత్రమే. ఇది ఆకులపై పిచికారీ చేయడం ద్వారా పనిచేస్తుంది. పంట దిగుబడిని సగటున 8 శాతం వరకు పెంచగలదని వివిధ పరిశోధనల్లో తేలిందని వ్యవసాయ శాఖ చెబుతుంది. మొక్కల పోషక వినియోగ సామర్థ్యాన్ని సైతం 80 శాతం వరకు మెరుగుపరుస్తుంది. నానో వాడకం వల్ల రవాణా, నిల్వ ఖర్చులు తగ్గుతాయి. బస్తాలను మోయాల్సిన అవసరం ఉండదు. ఇది మొక్కలకు నిరంతరంగా నత్రజనిని అందించే రిజర్వాయర్‌లా పనిచేస్తుంది. సుస్థిర వ్యవసాయానికి తోడ్పడుతుంది. దీనిని సాధారణ స్ప్రేయర్లతో పిచికారీ చేయవచ్చు. చాలా వరకు పురుగు మందులు, తెగుళ్ల మందులతో కలిపి వాడవచ్చు. మిశ్రమాన్ని కలిపే ముందు 'జార్‌ టెస్ట్‌' (గాజు సీసా పరీక్ష) తప్పనిసరి చేయాల్సి ఉంటుంది. కలుపు మందులతో కలిపి వాడకపోవడమే మంచిది.



అతి తక్కువ ధర

నానో యూరియా వినియోగంతో పంట సాగు ఖర్చు తగ్గుతుంది. అర లీటర్‌ ద్రావణం 45 కేజీల గుళికల యూరియా బస్తాకు సమానంగా పనిచేస్తుంది. బస్తా యూరియా రూ. 278 కాగా, నానో యూరియా రూ. 225కే అర లీటర్‌ లభిస్తుంది. దీంతో రైతులకు ఖర్చులు ఆదా అవుతాయి. మరోవైపు భూసారంపై ఎలాంటి ప్రమాదం చూపకుండా రైతులకు ప్రయోజనకారిగా ఉంటుంది. చిన్న, సన్నకారు రైతులకు ఇది ఆర్థికంగా లాభదాయకం. నానో యూరియా వినియోగంతో పంటల్లో పచ్చదనం చురుగ్గా పెరుగుతుంది. గుళికల యూరియాను రైతులు పంట సాగుకు రెండు నుంచి మూడుసార్లు వినియోగిస్తున్నారు. ఇందులో నత్రజని 30 నుంచి 50 శాతమే వినియోగంలోకి వస్తుంది. మిగితా ఎరువు వృథాగా పోతుంది. దీంతో నేల, గాలి, నీరు కలుషితం అవుతుంది. నానో యూరియా మాత్రం కేవలం పంటకు మాత్రమే ఉపయోగపడుతుంది.

జిల్లాలో పంటల సాగు

వానాకాలం సీజన్‌లో సాగు అంచనా 3.50 లక్షల ఎకరాల్లో జరుగుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. కాని వర్షాభావ పరిస్థితుల్లో జిల్లాలో ఇప్పటివరకు అన్ని రకాలు పంటల సాగు 1.38 లక్షలు మాత్రమే సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా వరి, పత్తి పంటలు సాగైనట్లు తెలిసింది.

అందుబాటులో ఉంది

నానో యూరియా జిల్లాలో కావాల్సిన మేర అందుబాటులో ఉంది. గుళికల యూరియాతో పోలిస్తే అత్యధిక ప్రయోజనాలు ఇందులో లభిస్తాయి. నానో యూరియా పిచికారి చేయడం వల్ల కేవలం పంట మాత్రమే వినియోగించుకుంటుంది. భూసారం తగ్గకుండా ఉంటుంది. రైతులు గుళికల యూరియాకు బదులుగా నానో యూరియాను వినియోగించాలి. ఈమేరకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– దేవ్‌కుమార్‌, జిల్లా వ్యవసాయ అధికారి

టీచర్లకు పదోన్నతులు

- ప్రారంభమైన ప్రక్రియ
- 25 జీహెచ్‌ఎం, 155 మందికి స్కూల్‌ అసిస్టెంట్లుగా ప్రమోషన్‌
- 11 వరకు కౌన్సెలింగ్‌
- తీరనున్న సబ్జెక్ట్‌ టీచర్ల కొరత



పాపన్నపేట(మెదక్‌): ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం అయింది. బదిలీలు లేకుండానే ప్రమోషన్లు ఇవ్వడానికి విద్యాశాఖ సిద్ధమైంది. ఈనెల 2 నుంచి 11 వరకు ప్రమోషన్ల షెడ్యూల్‌ విడుదల అయింది. జిల్లాలోని అర్హులైన టీచర్ల నుంచి 25 మంది జీహెచ్‌ఎంలుగా, 123 స్కూల్‌ అసిస్టెంట్లు, 32 పీఎస్‌ హెచ్‌ఎంలు పదోన్నతి పొందనున్నారు. కేవలం ఏడాది వ్యవధిలో మరోసారి ప్రమోషన్లు ఇస్తుండటంతో టీచర్లలో ఆనందం వ్యక్తమవుతుంది. తద్వారా సబ్జెక్టు టీచర్ల కొరత తీరనుంది.

180 మంది అర్హులకు పదోన్నతులు

జిల్లాలో 871 ఎంపీపీ, జెడ్పీ స్కూల్స్‌, 37 గవర్నమెంట్‌ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో వివిధ కేటగిరిలకు చెందిన 4,191 మంది టీచర్లు పనిచేస్తున్నారు. కాగా 25 జీహెచ్‌ఎం, 123 స్కూల్‌ అసిస్టెంట్‌, 32 పీఎస్‌ హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జీహెచ్‌ఎం పోస్టులు మల్టీజోన్‌–1 కిందకు రాగా, మిగితావి జిల్లా స్థాయి కేడర్‌ పోస్టులే. అయితే 2023లో ప్రమోషన్లపై 18 జిల్లాల పరిధిలో నుంచి వచ్చిన జీహెచ్‌ఎంలు తమకు బదిలీలు నిర్వహించి, తర్వాత ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్‌ చేస్తూ వచ్చారు. కాని వారి వేదన అరణ్య రోదన గానే మారింది. గతంలో స్కూల్‌ అసిస్టెంట్లకు 2024 జూన్‌, జూలై నెలలో పదోన్నతులు కల్పించారు.

షెడ్యూల్‌ ఇలా..

ఈనెల 2న వెబ్‌సైట్‌లో ఖాళీల ప్రదర్శన, 3న సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, 4న అభ్యంతరాల పరిష్కారం, తుది సీనియారిటీ జాబితా విడుదల, 6న గెజిటెడ్‌ హెచ్‌ఎంలుగా పదోన్నతి కోసం, స్కూల్‌ అసిస్టెంట్లు వెబ్‌ ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం, 7న స్కూల్‌ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వుల జారీ, 8న ఎస్జీటీల సీనియారిటీ తుది జాబితా విడుదల, 10న స్కూల్‌ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించేందుకు ఎస్జీటీలు వెబ్‌ ఆప్షన్లు ఇచ్చుకునే ప్రక్రియ ప్రారంభం, 11న ఎస్జీటీలకు స్కూల్‌ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు విడుదలు చేయనున్నారు.

రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

మెదక్‌ ఎంపీ రఘునందన్‌రావు


బీజేపీలో చేరిన యువకులతో ఎంపీ

వెల్దుర్తి(తూప్రాన్‌): భవిష్యత్తులో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని మెదక్‌ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. శనివారం మండలంలోని ఏదులపల్లిలో పలువురు యువకులు ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీలో చేరిన యువకులు ప్రజా సేవలో పాలు పంచుకోవాలన్నారు. తన గెలుపునకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను స్థానిక ఎన్నికల్లో గెలిపించుకునే బాధ్యత తనపై ఉందన్నారు. జిల్లాలో తాను ఎంపీగా గెలిచిన కొన్ని నెలల వ్యవధిలోనే కేంద్ర నుంచి రూ. వందల కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నానన్నారు. పార్టీలో చేరిన వారిలో ఏబీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్‌, మండల అధ్యక్షుడు దాసు, నాయకులు శ్రీనివాస్‌గౌడ్‌, నర్సింలు, వెంకటేశం, నరేష్‌, బాలకిషన్‌, శేఖర్‌గౌడ్‌, శ్రీధర్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

హిందువులు చైతన్యవంతులు కావాలి

మెదక్‌జోన్‌: హిందూ మతం మీద ఉద్దేశపూర్వకంగా దాడులు జరుగుతున్నాయని, హిందువులు చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఆసన్నమైందని మెదక్‌ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మెదక్‌ కోదండ రామాలయాన్ని అధికారులు శనివారం ఎండోమెంట్‌ పరిధిలోకి తీసుకోవడంతో ఆలయాన్ని సందర్శించి మాట్లాడారు. వేణుగోపాల స్వామి ఆలయాన్ని ఎండోమెంట్‌ పరిధిలోకి తీసుకున్నాక అక్కడ దీపం పెట్టేవారు ఎందుకు లేరని ప్రశ్నించారు. ఆలయ కమిటీ తప్పులు చేస్తే శిక్షించాలి, అవసరమైతే వారిని తప్పించి మరో కమిటీని నిర్ణయించాలి, కానీ అధికార పార్టీ నేతలు చెబితే తాళాలు వేస్తారా..? అని ప్రశ్నించారు. కశ్మీర్‌లో సైనికుల ప్రాణాలను పణంగా పెట్టి పోరాటం చేస్తుంటే, యూపీఏ నేతలు మాత్రం పాక్‌ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అంతకుముందు బీజేపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని గాంధీనగర్‌లో కేన్సర్‌ ఆస్పత్రి కోసం స్థలాన్ని పరిశీలించారు. దేశంలోనే మొట్టమొదటగా జిల్లా కేంద్రంలో కేన్సర్‌ ఆస్పత్రిని దాతల సహకారంతో పాటు ఎంపీ నిధులు వెచ్చించి నిర్మిస్తానన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ: ఎస్పీ

తూప్రాన్‌: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అని ఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం తూప్రాన్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కమాండ్‌ కంట్రోల్‌ను ప్రారంభించారు. అనంతరం అదనపు ఎస్పీ మహేందర్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో గంజాయి, సైబర్‌ నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం మొబైల్స్‌ పోగొట్టుకున్న బాధితులకు రికవరీ చేసినవి అందజేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తూప్రాన్‌ డీఎస్పీ నరేందర్‌గౌడ్‌, సీఐ రంగకృష్ణ, ఎస్‌ఐ శివానందం, మున్సిపల్‌ కమిషనర్‌ గణేశ్‌ను అభినందించారు. అనంతరం మండలంలోని ఇమామ్‌పూర్‌లో గ్రామస్తులు సొంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు.

దరఖాస్తుల అహ్వానం

మెదక్‌ కలెక్టరేట్‌: స్కాలర్‌షిప్‌ల కోసం ఎస్సీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారిణి విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025– 26 విద్యా సంవత్సరానికి జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు ఫ్రెష్‌, రెన్యూవల్‌ స్కాలర్‌షిప్‌లు అందజేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని విద్యార్థులంతా సెప్టెంబర్‌ 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్‌ నిధులు

- జిల్లాలో 88,257 మందికి రూ.17.65 కోట్లు జమ
- డీఏఓ దేవ్‌కుమార్‌


పీఎం కిసాన్‌ సమ్మాన్‌ నిధి కార్యక్రమాన్ని వీక్షిస్తున్న డీఏఓ, శాస్త్రవేత్తలు, రైతులు

కౌడిపల్లి(నర్సాపూర్‌): రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్‌ నిధులు జమయ్యాయని డీఏఓ దేవ్‌కుమార్‌ తెలిపారు. శనివారం మండలంలోని తునికి కేవీకేలో 20వ విడత పీఎం కిసాన్‌ సమ్మాన్‌ నిధి నిధుల విడుదల కార్యక్రమాన్ని శాస్త్రవేత్తలు, రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి వీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 88,257 మంది రైతులకు రూ 17. 65 కోట్ల నిధులను కేంద్రం విడుదల చేసిందన్నారు. రైతులు పెట్టుబడికి సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పంటల సాగులో సమస్యలుంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అనంతరం కేవీకే హెడ్‌ అండ్‌ సైంటిస్ట్‌ శంభాజీ దత్తాత్రేయ నల్కర్‌ మాట్లాడుతూ.. ప్రతి రైతు ప్రకృతి, సేంద్రియ సాగు చేయాలన్నారు. పంటల సాగులో ఆవు పేడ, మూత్రం, జీవామృతం, జీవన ఎరువులు, కషాయాలు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ రాజశేఖర్‌, కేవీకే శాస్త్రవేత్తలు శ్రీకాంత్‌, రవికుమార్‌, ప్రతాప్‌రెడ్డి, భార్గవి, శ్రీనివాస్‌, ఉదయ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీయొద్దు

బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి


రాస్తారోకో చేస్తున్న పద్మారెడ్డి, తదితరులు

మెదక్‌ మున్సిపాలిటీ: భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా కోదండ రామాలయాన్ని దేవాదాయ శాఖలో విలీనం చేయడం దుర్మార్గమైన చర్య అని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రామాలయం ఎదుట రహదారిపై బీఆర్‌ఎస్‌ నాయకులు, భక్తులతో కలిసి రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ జీఓ రద్దు చేసి విలీనాన్ని విరమించుకోకుంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. పట్టణ ప్రజలు, భక్తుల విరాళాలతో గత 49 ఏళ్ల క్రితం నిర్మించిన దేవాలయానికి ప్రభుత్వం నేటి వరకు ఎలాంటి సహాయ సహకారాలు అందించ లేదన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఉదయం 7 గంటలకు పోలీసుల బందోబస్తుతో దేవాదాయ శాఖ అధికారులు దొంగల్లా హుండీతో పాటు దర్మసత్రాన్ని సీజ్‌ చేయడం సరికాదన్నారు. ఈ ఆలోచనను దేవాదాయశాఖ తక్షణమే విరమించుకోవాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వం కుట్ర పూరితంగానే దేవాదాయ శాఖకు అప్పగించిందని, దీనిపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌ చైర్మన్‌ మల్లికార్జున్‌ గౌడ్‌, జెడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు లావణ్యరెడ్డి, పట్టణ కన్వీనర్‌ ఆంజనేయులు, కృష్ణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రసాభాసగా చెక్కుల పంపిణీ


చెక్కులు, రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ నాయకుల మధ్య ఘర్షణ

హత్నూర(సంగారెడ్డి): హత్నూర రైతు వేదికలో శనివారం నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కులు, రేషన్‌ కార్డుల పంపిణీ రసాభాసగా మారింది. ఎమ్మెల్యే సునీతారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతుండగా.. కాంగ్రెస్‌ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసేందుకు సమావేశ మందిరంలోకి ఒక్కసారిగా వచ్చారు. దీంతో వెంటనే అక్కడే ఉన్న బీఆర్‌ఎస్‌ నాయకులు వారిని అడ్డుకోవడానికి యత్నించగా, ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు పార్టీల నాయకులను బయటకు లాక్కెళ్లారు. ప్రజల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్‌ను, మంత్రులను కూడా కలుస్తానని ఆమె స్పష్టం చేశారు. నియోజకవర్గంలో తాను చేపట్టే కార్యక్రమాల విషయాలలో అధికార పార్టీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తుండటం సరికాదన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అదనపు కలెక్టర్‌ నగేశ్‌


పట్టణంలో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్‌ నగేశ్‌

మెదక్‌ మున్సిపాలిటీ: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్‌ నగేశ్‌ అధికారులను ఆదేశించారు. వంద రోజుల యాక్షన్‌ ప్లాన్‌లో భాగంగా శనివారం పట్టణంలోని 23, 31వ వార్డులో మున్సిపల్‌ కమిషనర్‌ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా ఇంటింటికీ తిరిగి తడి, పొడి, హానికరమైన చెత్తను వేరుచేసి మున్సిపల్‌ వాహనాలకు ఇవ్వాలని సూచించారు. అలాగే దోమలు వ్యాప్తి చెందకుండా అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మున్సిపల్‌ కమిషనర్‌ శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. అనంతరం ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను తీర్చాలని సూచించారు. కార్యక్రమంలో మెదక్‌ మున్సిపల్‌ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ నాగరాజు, ఎన్విరాన్‌మెంటల్‌ ఇంజనీర్‌ వెంకటేశ్‌, వార్డు అధికారులు, శానిటరీ జవాన్లు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి

డీఈఓ రాధాకిషన్‌


టీచర్లతో మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్‌

పాపన్నపేట(మెదక్‌): ప్రతి విద్యార్థికి కనీస అభ్యసన సామర్థ్యాలు రావాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌ అన్నారు. శనివారం ఆయన కుర్తివాడలో జరిగిన యూపీ స్థాయి గణితం కాంప్లెక్స్‌ సమావేశాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి స్థాయికి తగ్గ సామర్థ్యాలు వచ్చేలా చూడాల్సిన బాధ్యత టీచర్లదేనన్నారు. చతుర్విధ ప్రక్రియలపై దృష్టి సారించాలని కోరారు. నిత్య జీవితంలో లెక్కలు ముఖ్యమైనందున, గణితంపై పట్టు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. టీచర్లు సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌ విధానం అమల్లోకి వచ్చినందున, ప్రతి ఒక్కరూ దానిని పాటించాలన్నారు. ప్రభుత్వ బడులను కార్పొరేట్‌ స్థాయిలో తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో టేక్మాల్‌, పాపన్నపేట మండలాల టీచర్లు, కాంప్లెక్స్‌ హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు, సీఆర్పీ దేవయ్య పాల్గొన్నారు.

చిన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం

జూనియర్‌ సివిల్‌ జడ్జి హేమలత


చిన్నారులతో మాట్లాడుతున్న జడ్జి హేమలత

నర్సాపూర్‌: పాఠశాలలకు వచ్చే చిన్న పిల్లల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జూనియర్‌ సివిల్‌ జడ్జి హేమలత సూచించారు. శనివారం మండల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలను బయటకు ఎందుకు పంపుతున్నారని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. మౌలిక సదుపాయాలు లేనందున బయటకు పంపాల్సి వస్తుందని వారు వివరించారు. పిల్లల పట్ల అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల గదులలో విద్యార్థులకు విద్యా బోధన చేపట్టడం సరికాదన్నారు. ఉన్నతాధికారులకు విషయం చెప్పారా..? అని ప్రశ్నించారు. కాగా పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిన విషయాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తానని తెలిపారు. అనంతరం పక్కనే ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు.

గ్రూపులుంటేనే మజా!

- గ్రూపులు, ఆధిపత్య పోరు లేకుండా పార్టీ అభివృద్ధి చెందదు
- ఎన్నికలు వస్తే అంతా ఒక్కటై పోరాడాలి
- పాత, కొత్త నాయకుల కలయికతో ముందుకు సాగుదాం
- కాంగ్రెస్‌ కార్యకర్తల సమావేశంలో పీసీసీ చీఫ్‌ మహేశ్‌కుమార్‌గౌడ్‌



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్‌కుమార్‌గౌడ్‌, చిత్రంలో మంత్రి మంత్రి దామోదర, నాయకులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి /వట్‌పల్లి : రాజకీయ పార్టీల్లో ఆధిపత్య పోరు, గ్రూపులు లేకుంటే ఆ పార్టీ అభివృద్ధి చెందదని, గ్రూపులు ఉంటేనే ఉత్సాహం ఉంటుందని టీపీసీసీ చీఫ్‌ మహేశ్‌కుమార్‌ గౌడ్‌ పేర్కొన్నారు. గ్రూపు తగాదాలు లక్ష్మణ రేఖ దాటవద్దని సూచించారు. అన్ని నియోజకవర్గాల్లో గ్రూపులు ఉంటాయని, ఎన్నికలు వస్తే అన్ని గ్రూపులు ఒక్కటై పోరాడి విజయం సాధించాలని హితవు పలికారు. తాము మాత్రం అన్ని గ్రూపులకు సమాన ప్రాధాన్యమిస్తామని స్పష్టం చేశారు. జనహిత పాదయాత్రలో భాగంగా కాంగ్రెస్‌ నాయ కులు శనివారం జోగిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం సంగుపేటలో జరిగిన కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీకి కార్యకర్తలే బలమని, చాలా ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్న వారికే ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. పార్టీకి కొత్త నీరు కూడా అవసరమని అందుకే 15 శాతం కొత్తవారిని కూడా తీసుకుంటున్నామని, పాత, కొత్తల కలయికతో ముందుకు సాగుతున్నామని వివరించారు.

సర్వేల ఆధారంగానే స్థానిక టికెట్లు

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచే అభ్యర్థులకే టికెట్లు ఇస్తామని, సర్వేల ఆధారంగానే ఈ టికెట్ల కేటాయింపు ఉంటుందని మహేశ్‌కుమార్‌గౌడ్‌ పేర్కొన్నారు. నిత్యం ప్రజలతో మమేకమయ్యే వారి ఇంటికే స్థానిక సంస్థల ఎన్నికల టికెట్లు నడిచివస్తాయని తెలిపారు. చాలా ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్న వారికి కార్పొరేషన్‌ డైరెక్టర్‌ పోస్టులు ఇస్తామని చెప్పారు.

పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించండి: కార్యకర్తలు

పార్టీ కోసం కష్టపడిన వారినే గుర్తించాలని పలువురు కాంగ్రెస్‌ కార్యకర్తలు మీనాక్షి నటరాజన్‌, మహేశ్‌కుమార్‌ గౌడ్‌లకు విజ్ఞప్తి చేశారు. తమ పబ్బం గడుపుకునేందుకు పార్టీలోకి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వద్దని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసే అధికారం ఇందిరమ్మ కమిటీలకు ఇవ్వాలని కోరారు. టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ జగ్గారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేశ్‌షెట్కార్‌, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సెట్విన్‌ కార్పొరేషన్‌ రాష్ట్ర చైర్మన్‌ గిరిధర్‌రెడ్డి, పార్టీ నాయకులు చంద్రశేఖర్‌, రెడ్డిపల్లి ఆంజనేయులు, ఆవుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు నాయకులు దూరం

జనహిత పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి పటాన్‌చెరు నియోజకవర్గం కార్యకర్తలు, నాయకులు దూరంగా ఉన్నారు. అన్ని నియోజకవర్గాల నుంచి ముఖ్య కార్యకర్తలు నేతలు ఈ సమావేశానికి హాజరైనప్పటికీ, ఈ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ శ్రేణులు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.